క్లుప్తంగా

జిల్లా పోటీల్లో డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సంతోష్

చింతలపూడి: గత ఏడాది డిసెంబర్ 27న నిర్వహించిన యువ ఉత్సవ జిల్లా స్థాయి పోటీల్లో చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న బీఏ విద్యార్థి ఆర్.సంతోష్ తెలుగు కవితల్లో ద్వితీయ స్థానాన్ని సాధించాడు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శ్రమించే తత్వం, పట్టుదల, లక్ష్యం ఉన్నట్లయితే ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థాయికి ఎదగగలుగుతారని విద్యార్థిని ప్రశంసించారు. అధ్యాపకుల కృషి వల్లనే ఈ ఘనత దక్కిందని, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



చిన్నారి వైద్యం నిమిత్తం సహాయాన్ని అందిస్తున్న పోల్నాటి రాజా

జంగారెడ్డిగూడెం: చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం పోల్నాటి రాజా ఆర్థిక సాయం అందించారు. మండలానికి చెందిన కై కవరపు విక్టర్ పాలు కుమారుడు నీళ్ల తొట్టిలో పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చిన్నారి చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం కింద పోల్నాటి రాజా రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పోల్నాటి శ్రీను, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, పోల్నాటి రాజు, పత్తిపాటి రాజారావు పాల్గొన్నారు.

కొవ్వలిలో జనార్దన స్వామి ఊరేగింపు

దెందులూరు: కొవ్వలిలో జనార్దన స్వామి ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి ఆలయంలో భక్తులు ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో గ్రామంలోని వీధుల గుండా పల్లకిలో ఊరేగించారు. మేళ తాళాలతో ఊరేగింపు కార్యక్రమం ఘనంగా కొనసాగింది. భక్తులు, స్వామివారిని దర్శించుకుని పువ్వులు, పండ్లు కానుకలు అందజేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

బాలసదనం చిన్నారులకు దుప్పట్ల పంపిణీ

దెందులూరు: చల్లచింతలపూడికి చెందిన జై గౌడ సేన రాష్ట్ర నాయకుడు నూతి రవీందర్ గౌడ్ బుధవారం దెందులూరులో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంలో చిన్నారుకులకు దుప్పట్లు, పెన్సిళ్లు పంపిణీ పంపిణీ చేశారు. బాలసదనం సూపరింటెండెంట్ ఎస్ బేబి సరోజినీ, అకౌంటెంట్ దుర్గామల్లేశ్వరితో కలిసి రవీందర్ గౌడ్ హాస్టల్లో ఉండే చిన్నారులకు దుప్పట్లు, పెన్సిళ్లు అందజేశారు. జై గౌడ సేన సంఘం నాయకులు బొప్పన పూర్ణచంద్రారావు ఉన్నారు

సౌత్‌జోన్ వాలీబాల్ జట్టుకు దంత వైద్య విద్యార్థిని ఎంపిక



మహిళల వాలీబాల్ జట్టుకు ఎంపికైన సహిస్త అంబ్రిన్‌ను అభినందిస్తున్న దృశ్యం

పెదవేగి : సౌత్ జోన్ మహిళల వాలీబాల్ జట్టుకు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి మోజెస్ గురువారం తెలిపారు. పెదవేగి మండలం దుగ్గిరాల దంత కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సహిస్త అంబ్రిన్, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాల్లో నిర్వహించిన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఈ త్రిమూర్తి సారథ్యంలో సౌత్ జోన్ మహిళల వాలీబాల్ సెలెక్షన్‌లో విద్యార్థిని ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈమె జనవరి నెల 7 నుంచి 11వ తేదీ వరకు తమిళనాడులో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటుందని ప్రిన్సిపాల్ స్లీవరాజు చెప్పారు.

హిందూ మతాన్ని కాపాడుకోవాలి

ఉంగుటూరు: దేవాలయాల ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన అవసరం హిందువులపై ఉందని కాకినాడ జిల్లా సోమేశ్వరానికి చెందిన అడబాల స్వామిజీ అన్నారు. ఆయన పాదయాత్ర చేసుకుంటూ గన్నవరం హైందవ శంఖారావానికి వెళుతూ ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఆగారు. అక్కడ స్వామీజి మాట్లాడుతూ భారతదేశం గొప్పతనం, పేరు ప్రతిష్ఠలు, సంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ఏజెన్సీలో మొక్కజొన్న సాగు బాగు

- సాగులో నిమగ్నమైన రైతులు
- నియోజకవర్గంలోని 7,025 ఎకరాల్లో పంట సాగు
- సాగుపై రైతులకు అవగాహన కలిగిస్తున్న వ్యవసాయాధికారులు





చింతలగూడెంలో వేసిన మొక్కజొన్న పంట, దొరమామిడిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ

మండలం	ఎకరాలు
బుట్టాయగూడెం	1810
జీలుగుమిల్లి	54
కుక్కునూరు	11
వేలేరుపాడు	5
పోలవరం	1550
టి.నర్సపురం	600
కొయ్యలగూడెం	3000

బుట్టాయగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. రబీలో కీలక పంటలైన పొగాకు, వరి, మిర్చి పంటలతో పాటు అత్యధికంగా రైతులు మొక్కజొన్న పంటను విస్తారంగా పండిస్తున్నారు. మొక్కజొన్న పంట సాగుపై రైతులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. పంట సాగుపై వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. అలాగే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి కోతల తర్వాత రైతులు మొక్కజొన్న సాగును చేపట్టారు. కోళ్లు, పాడి పశువులు, చేపల మేతగా మొక్కజొన్నకు మంచి గిరాకీ ఉండటంతో ఆ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

నియోజకవర్గంలో 7025 ఎకరాల్లో సాగు

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కొయ్యలగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు, టి.నర్సాపురం మండలాల పరిధిలో రబీ సీజన్‌లో సుమారు 7,025 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట వేశారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులతో పాటు జలాశయాలు, చెరువుల కింద భూముల్లో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. బుట్టాయగూడెం మండలంలోని జల్లేరు జలాశయం, పోగొండ రిజర్వాయర్, కోడే కాల్వ పరిధిలో సుమారు 1810 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. అదేవిధంగా జీలుగుమిల్లి మండలంలో 54, కుక్కునూరు మండలంలో 11 ఎకరాలు, పోలవరం మండలంలో 1550 ఎకరాలు, వేలేరుపాడు 5 ఎకరాలు, టి.నర్సాపురం మండలంలో 600 ఎకరాలు, కొయ్యలగూడెం మండలంలో 3 వేల ఎకరాల్లో రబీలో మొక్కజొన్న సాగు చేసినట్లు అధికారులు చెప్పారు.

రబీలో విస్తారంగా మొక్కజొన్న సాగు



రబీ సీజన్‌లో అత్యధికంగా మొక్కజొన్న సాగును రైతులు వేశారు. సాగుకు సంబంధించి రైతులకు అన్ని రకాల సలహాలు, సూచనలు ఇస్తున్నాం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలా కృషి చేస్తున్నాం. విద్యుత్ మోటర్లు, జలాశయాలు, చెరువుల కింద రైతులు ఎక్కువగా మొక్కజొన్న సాగు చేపట్టారు.

–డి.ముత్యాలరావు, ఏఓ, బుట్టాయగూడెం మండలం

మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను



ఈ ఏడాది రబీలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. పంట సాగుకు సంబంధించి అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. మొక్కజొన్న పంటకు మంచి గిరాకీ ఉండడంతో ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నాను. పంట కూడా ఆశాజనకంగా ఉంది.

–పూనెం చలపతిరావు, రైతు, ఎన్ఆర్ పాలెం, బుట్టాయగూడెం మండలం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కామవరపుకోట: మండలంలో జీలకర్రగూడెం సబ్‌స్టేషన్ నుంచి గుంటుపల్లి ఫీడర్, జీలకర్రగూడెం ఏజీయల్ ఫీడర్లు మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లైన్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం ఈ నెల మూడో తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

4న రాష్ట్ర స్థాయి సమావేశం

పోలవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం జనవరి నాలుగు నుంచి ఆరో తేదీ వరకు ఏలూరు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవస్యా కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.సాయికృష్ణ తెలిపారు. వ్యవసాయ కార్మికులు ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనేక పోరాటాలకు, ఆందోళనలకు కార్మిక సంఘం మద్దతు తెలుపుతుందన్నారు.

జూదం, కోడి పందేల నిర్వాహకులపై కఠిన చర్యలు

ఉంగుటూరు: సంక్రాంతి సందర్భంగా పేకాట, గుండాట, కోడిపందేలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ హెచ్చరించారు. గురువారం కాకర్లమూడిలో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి లా అండ్ ఆర్డరు సమస్య వచ్చినా సహించేది లేదని తెలిపారు. సర్పంచి నాగు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

పెదవేగి: అతివేగంగా వచ్చిన కారు మోటారు సైకిల్‌ను ఢీ కొట్టిన ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచాడు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయికి చెందిన వాక జితేంద్రకుమార్ 2024 డిసెంబర్ 28న వారి కుటుంబ సభ్యులతో కలిసి మోటార్ సైకిల్‌పై ఏలూరు దుస్తుల కొనుగోలుకు వెళుతుండగా ఏపీ 39 ఏఏ 1900 నంబర్ గల కారును డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి వెనుక నుంచి ఢీకొట్టినట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో జితేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 2025 జనవరి 2న వాక జితేంద్రకుమార్ (59) మృతి చెందాడని ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

టి.నరసాపురం: చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతి చెందిన ఘటన టి.నరసాపురంలో చోటు చేసుకుంది. దీనిపై ఎస్సై ఎం.జయబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లంచర్లరాజు పాలెం గ్రామానికి చెందిన శీలం సీతారావమ్మ డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం ఇంటి వద్ద చలిమంట వేసింది. ప్రమాదవశాత్తు సీతారావమ్మ చీరకు మంటలు అంటుకోవడంతో కేకలు వేసింది. వాకిలి ఊడుస్తున్న సీతారావమ్మ కుమార్తె యడ్లపల్లి నాగలక్ష్మి వెంటనే తన భర్తతో కలిసి మంటలు ఆర్పి, 108 వాహనంలో చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లింది. మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సీతారావమ్మ బుధవారం సాయంత్రం మృతి చెందిందన్నారు. ఈ మేరకు మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3,320 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీలు కృషి చేయాలి



చింతలపూడి: శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈవో రామారావు



పోలవరం రూరల్: కార్యక్రమంలో శిక్షణ ఇస్తున్న రీసోర్స్ పర్సన్లు పూనెం పోసిబాబు



లింగపాలెం: శిక్షణ అందిస్తున్న రిసోర్స్ పర్సన్లు

స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులకు శిక్షణ తరగతులు

చింతలపూడి: పాఠశాలల అభివృద్ధికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి జి.రామారావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ మేనేజమెంట్ కమిటీ సభ్యులకు ఒక రోజు శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్య లభించేలా కమిటీలు చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులకు విధులు, బాధ్యతలను గురించి వివరించారు. శిక్షణకు మండలంలోని 96 ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుధాకర్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: పాఠశాల యాజమాన్య కమిటీలు, ప్రధానోపాధ్యాయులకు గురువారం పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జె.సురేష్‌బాబు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి చేపట్టాల్సిన పలు అంశాలపై వారికి శిక్షణా కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. జిల్లా రీసోర్స్ పర్సన్లు పాఠశాల అభివృద్ధిలో యాజమాన్య కమిటీ భాగస్వామ్యం, సభ్యుల బాధ్యత, కమిటీ విధులు గురించి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. రీసోర్స్ పర్సన్లు పూనెం పోసిబాబు, మణికంఠ, రాజేంద్రప్రసాద్ శిక్షణ అందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు దామోదరరావు, కృష్ణమూర్తి, దిలీప్ పాల్గొన్నారు.

లింగపాలెం: పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాఠశాలల్లో భాగస్తువ్వాలని మండల విద్యాశాఖ అధికారులు కంఠ రామారావు, జె.రవీంద్ర తెలిపారు. మండలంలోని సింగగూడెం హైస్కూల్ నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం ఎస్ఎంసీ సభ్యులు నిర్వర్తించవలసిన విధులు, బాధ్యతలు నిర్వర్తించాలని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, టాయిలెట్స్ పరిశీలన విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ, వంటి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్లు సొంగ నాగేశ్వరరావు, తోట సతీష్, కేవీవీ సత్యనారాయణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు వై.రాంబాబు, టి.వెంకన్న శిక్షణ అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కుక్కునూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసిన ఘనత యూటీఎఫ్‌కు దక్కుతుందని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వాంకుడోత్ నాగేశ్వరావు పేర్కొన్నారు. గురువారం కుక్కునూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను నాగేశ్వరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ యూనియన్‌ను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 7, 8 తేదీల్లో కాకినాడలో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిరవెల్లి హైస్కూల్, ఏహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు భవానీ, మంగమ్మ, ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అద్భుత ఫలితాలు



రైతులకు వేపగింజల కషాయం, ఇంగువ పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతీ రైతు ఆచరిస్తే వ్యవసాయ రంగంలో అద్భుత ఫలితాలు సాధించొచ్చని కృషి విజ్ఞాన కేంద్రం (వెంకటరామన్నగూడెం) సైంటిస్ట్ డాక్టర్ రేఖ తెలిపారు. జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెంలో గురువారం జీడిమామిడి పంట సాగు చేసే రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేఖ మాట్లాడుతూ జీడిమామిడి సాగు చేసే రైతులు పూత దశలో మొదటి దఫాగా వేప గింజల కషాయాన్ని పిచికారీ చేసే విధంగా వివరించారు. అలాగే సీనియర్ సైంటిస్ట్ విజయలక్ష్మి మాట్లాడుతూ విషపూరిత రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సహజ పద్ధతిలో చీడ, పీడలను నివారించి నాణ్యమైన దిగుబడులు సాధించొచ్చని చెప్పారు. అనంతరం రైతులకు వేపగింజల కషాయం రెండు లీటర్లు, ఇంగువ కేజీ చొప్పున ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైదా వెంకటేశ్వరరావు ఏపీ సీఎన్ఎఫ్ డిపార్ట్‌మెంట్ ఎంటీ ధర్మరాజు, నాగేశ్వరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ డివిజన్ కార్యదర్శి సోయం చందర్రావు

కుక్కునూరు: కుక్కునూరు నుంచి భూర్గంపాడు వరకు చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి సోయం చంద్రావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అల్లిగూడెం గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చందర్రావు మాట్లాడుతూ కుక్కునూరు నుంచి వేలేరు వరకు చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకు పూర్తి కాలేదని విమర్శించారు. దీంతో రోడ్డుకు ఇరు పక్కల ఉన్న గ్రామాల ప్రజలు వాహనాల రాకపోకలతో వస్తున్న దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో నాయకులు మడకం పాండు, తమ్మయ్య, గీగా వెంకటేశం, కోవ్వాసి భీమయ్య, మడకం రీనులు పాల్గొన్నారు.

ట్రైకార్ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలి



కేఆర్‌పురం ఐటీడీఏలో ట్రైకార్ కార్యక్రమంపై సమీక్షిస్తున్న ఇన్‌చార్జి పీవో ధాత్రి రెడ్డి

బుట్టాయగూడెం: గిరిజన సంక్షేమానికి ఉద్దేశించిన ట్రైకార్ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే విధంగా కృషి చేయాలని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అధికారులను కోరారు. మండలంలోని కేఆర్ పురం ఐటీడీఏ కార్యాలయంలో గురువారం ట్రైకార్ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో పలు శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ట్రైకార్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని జేసీ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ధాత్రి రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీఓ పీవీఎస్ నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ్ వాటిక



అంగన్‌వాడీ సెంటర్‌లో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న పీడీ శారద, సీడీపీఓ విజయలక్ష్మి

దెందులూరు: మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి భరోసాకు ప్రభుత్వం సంబంధిత గ్రామాల్లో ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన నగదుతో పోషణ వాటి అభివృద్ధి పరిచే కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లు నిర్వహిస్తున్నారు. దెందులూరు మండలం దెందులూరులోని ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని టీచర్లు నిర్వహిస్తున్న పోషన్ వాటికను జిల్లా పీడీ శారద, పెదపాడు సీడీపీఓ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న వాటికను వారు పరిశీలించారు. కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డెన్‌లో ఆకుకూరలను, కూరగాయలను పెంచి వాటిని వినియోగించడం వల్ల అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించవచ్చని పీడీ శారద, సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

దెందులూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గాలాయగూడెం గ్రామ వైఎస్సార్‌సీపీ కార్యకర్త దర్శనపు రాకేష్ బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పార్టీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు స్ఫూర్తితో మృతుని కుటుంబానికి నిత్యావసర వస్తువులను అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని, తమ పూర్తి సహాయ సహకారాలు ఇస్తామని నాయకులు అన్నారు.

యువకుడిపై నలుగురి దాడి



తీవ్ర గాయాల పాలైన మణికంఠ

ద్వారకాతిరుమల: పాత కక్షల నేపథ్యంలో ఒక యువకుడిపై అతడి భార్య బంధువు ముగ్గురు స్నేహితులతో కలిసి దాడి చేశాడు. ఈ ఘటనలో బాధిత యువకుడు తీవ్ర గాయాల పాలై, ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మండలంలోని గుండుగొలనుకుంట గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన సంచలనాన్ని రేకెత్తించింది. ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. గుండుగొలనుకుంట గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మధ్యాహ్నపు మణికంఠ నాలుగు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన రమ్యను వివాహం చేసుకున్నాడు. అయితే రమ్యకు దగ్గరి బంధువు అయిన అదే గ్రామానికి చెందిన అద్దంకి ధర్మేంద్ర మూడు నెలల క్రితం మణికంఠను తీవ్రంగా బెదిరించాడు. అయినా మణికంఠ ఆ బెదిరింపులను లెక్క చేయకుండా తన పని తాను చేసుకుంటున్నాడు. ఇదిలా ఉంటే ధర్మేంద్ర తన స్నేహితులైన మధ్యాహ్నపు దుర్గారావు, అద్దంకి పవన్, మధ్యాహ్నపు దాసులతో కలిసి పథకం ప్రకారం పొలానికి వెళుతున్న మణికంఠపై కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర గాయాల పాలై, పంట బోదెలో రక్తపు మడుగులో పడి ఉన్న మణికంఠను చూసి అతడి స్నేహితులు తల్లికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆమె స్థానికుల సహాయంతో మణికంఠను కారులో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మణికంఠ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆస్పత్రి పోలీస్ అవుట్ పోస్టు సిబ్బంది ఎమ్మెల్సీ నమోదు చేశారు.